మహిళా సాధికారతకు పెద్దపీట

కడప : వైసిపి ప్రభుత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. శనివారం నగరంలోని 42/4 వ డివిజన్ రవీంద్రనగర్ సచివాలయం-4 పరిధిలో కార్పొరేటర్ చల్లా స్వప్న, ఇన్‌ఛార్జి చల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు షేక్ మహామ్మద్ షఫీ, బాలస్వామిరెడ్డి, సూర్యనారాయణ రావు, రెడ్డి ప్రసాద్, వైసిపి యువ నాయకులు ఉమైర్, నాయకులు అఫ్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, తుమ్మలకుంట శివ శంకర్, షఫీ ఉల్లాహ్, అహమ్మద్, ఛైర్మన్లు , డైరెక్టర్లు, సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లాలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డితో కలిసి ఏపీడీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న ఎన్ఆర్ఇజిఎస్ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా సంపూర్తి చేయాలని సూచించారు. అన్ని మండలాల్లో కూలీల పని దినాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఇజిస్ పరిధిలో నిర్వహించే అన్ని పనుల ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి స్టేజీ కన్వర్షన్ ప్రక్రియలో మరింత పురోగతి సాధించాలన్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎక్కడా అలసత్వం, తాత్సారం లేకుండా లక్ష్యం మేరకు గడువు లోగా పూర్తి చేయాలని హెచ్చరించారు. కూలీలకు సంబంధించి యాక్టివ్ జాబ్ కార్డుల ఆధార్ సీడింగ్ ప్రక్రియను ఎక్కడా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఎం, వ్యవసాయ అనుబంధ పనుల నిర్వహణకు సంబంధించి పనులను వేగవంతం చేసుకోవాలని, లేబర్ కంపోనెంట్, లేబర్ మొబిలైజేషన్ ఏ మాత్రం తగ్గకూడదని హెచ్చరించారు. సమావేశంలో డ్వామా ఏపీడీలు, పిఒలు, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గండికోటలో ఒబెరాయ్ బృందం

- రిసార్టులు, విల్లాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

గండికోట పరిసరాలను పరిశీలిస్తున్న ఒబెరాయ్ ప్రతినిధుల బృందం

ప్రపంచ పర్యాటక ప్రాంతంగా గుర్తింపుపొందిన గండికోటలో శనివారం ఒబెరాయ్ సంస్థ ప్రతినిధుల బృందం పర్యటించింది. ఇక్కడ రిసార్టులు, విల్లాల ఏర్పాటుకు జిల్లా అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించింది. సంస్థకు ప్రభుత్వం 50 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.250 కోట్లతో రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పెన్నానది లోయ, గండికోట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులతో కలిసి ఒబెరాయ్ ప్రతినిధులు విక్రమ్ జిత్‌సింగ్, ఆర్.శంకర్, కల్లోల్ కుండు, ఎంఎల్ఎల్.రెడ్డి, మహనార్ సింగ్ ఠాకూర్ గండికోటకు రెండు కిలోమీటర్ల దూరంలోని ఇసుకతోట (దొనివంకకోన) వద్ద స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేసుకున్నారు. మ్యాపులను పరిశీలించారు. సాయంత్రం ప్రతినిధుల బృందం కడపకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో గండికోట సర్పంచ్ కె.గురుఈశ్వర్ పాల్గొన్నారు.

జనంతో కిక్కిరిసిన దేవునికడప

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుమల తొలిగడప దేవునికడపలో లోక బాంధవుడు దివాకరుని జన్మదిన శుభ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన అఖిలాండ నాయకుడు కడప రాయుడు కొలువు దీరిన రథాన్ని భక్తులు పోటీపడి ఊరేగించారు. రథోత్సవం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. దేవుని కడప బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనిఆవరం కిక్కిరిసిన జనసంద్రం నడుమన శ్రీవారి రథోత్సవం రంగరంగ వైభోగంగా సాగింది. టిటిడి ఆధ్వర్యంలో భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం పోటెత్తిన భక్తజనులు నయనానందకరంగా దేవుని కడపలో ప్రారంభమైంది. తొలుత టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ముందుకు సాగించారు. తేరుపై గంభీరముద్ర సుందర స్వరూపులైన ఉత్సవమూర్తులను ప్రజలు తనివితీరా తిలకించి పులకించిపోయారు. రథం ముందుకు సాగుతుండగా భక్తులు గుమ్మడి కాయలు రథచక్రాల కింద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. దేవునికడపలో ఘనంగా రథ ఊరేగింపు అనంతరం శ్రీవారి తేరు తిరిగి తన నిజస్థానంలో నిలిచింది. రథోత్సవం తిరుచానూరు నుంచి విచ్చేసిన వేదపండితులు చిలుకపాటి తిరుమలా చార్యుల బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా టిటిడి భారీ ఏర్పాట్లు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

నేటి నుంచి భారతీయుడు-2 చిత్రీకరణ

గండికోటలో భారతీయుడు-2 చిత్రం కోసం వేసిన సెట్టింగులు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

గండికోటలో భారతీయుడు-2 సినిమా సందడి నెలకొంది. శనివారం నుంచి ప్రారంభం కావాల్సిన షూటింగ్ ఆదివారానికి వాయిదా వేశారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గండికోటలో కథానాయకుడు కమలహాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్ రూపొందిస్తున్న చిత్రం భారతీయుడు-2 సినిమా చిత్రీకరణకు సినిమా యూనిట్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు చిత్రీకరణకు సంబంధించి అనుమతులు తీసుకున్నట్లు పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. ఎనిమిది రోజుల పాటు గండికోటలోని మాధవ రాయస్వామి దేవాలయం, కోట ముఖద్వారం, ఎర్రకోనేరు తదితర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. 1996లో వచ్చిన భారతీయుడు సినిమాకు కొనసాగింపుగా 25 ఏళ్ల తర్వాత భారతీయుడు-2 రూపొందుతున్న ఈ చిత్రం కీలక షెడ్యూల్ గండికోటలో చిత్రీకరించనున్నారు. కోట ముఖద్వారం వద్ద పురాతన కాలంలో పశువులు, కూరగాయలు తదితర వస్తువులు విక్రయించే మార్కెట్ సెట్ పనులు చేశారు. ఆంగ్లేయుల కాలం నాటి వాహనాలు రెండు గండికోటకు చేరుకున్నాయి.

ఆర్‌జెడిని విధుల నుంచి తప్పించాలి : 'సిటు'

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని విధుల నుంచి తప్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కె.శ్రీని వాసులరెడ్డి బి.మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో వారు ప్రజాశక్తితో మాట్లాడారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి ఏడు గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ హాలులతో జిల్లాలోని ప్రధానో పాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ ముఖ్యులతో సమావేశం నిర్వహణ చేశామనే పేరుతో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన రాజకీయం చేయ డంపై విచారణ చేపట్టాలన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయ ఓటర్లపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చేందుకు ఇటువంటి సమా వేశాన్ని ఉపయో గించుకున్నాడని తెలిపారు. ఇటువంటి పక్షపాత కలి గిన అధికారులను తక్షణమే తప్పించాలని, ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరో సారి ఇటువంటి తప్పిదానికి పాల్పడితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి ఇటువంటి అధికారులు తూట్లు పొడుస్తారని, ఇప్పటికే ఓటర్ల జాబి తాలో అనర్హుల చేరికల నేపథ్యంలో ఆందో ళనలు వ్యక్తమవుతున్న నేపథ్యం లో ఇటువంటి పక్ష పాతం కలిగిన ఉన్నతాధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పారదర్శకతను సవాలు చేస్తున్నట్లు అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

సత్వర న్యాయం పొందండి

కడప : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా మొదటి అదనపు జడ్జి సి.ఎన్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత విజ్ఞప్తి చేశారు. పూర్తి సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

జిల్లా అంతటా జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి- కడప

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో, అన్ని మండల కేంద్రాలలో ఉదయం 9 గంటల లోపల జాతీయ పతాకాన్ని ఎగురవే యాల్సిందిగా జిల్లా పార్టీ శ్రేణులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ జెండా ఎగురవేసే సమయంలో అక్కడ మహాత్మా గాంధీ ఫోటో ఉంచి పూలమాల వేయాలని విజ్ఞప్తి చేశారు.

కమనీయం శ్రీవారి కల్యాణం

ప్రజాశక్తి- చెన్నూరు

శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి (కోట్ల స్వామి), సరస్వతి నగర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం రథసప్తమి సందర్భంగా శ్రీవారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య, మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహించిన కల్యాణానికి మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 10-12 గంటల మధ్య కల్యాణం నిర్వహించారు. అనంతరం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

క్రైస్తవ సంక్షేమ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి- కడప

క్రైస్తవ సంక్షేమ అభివృద్ధికి నిధులు కేటా యించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ఫెడరేషన్ స్టేట్ కమిటీ బృందం జనరల్ సెక్రెటరీ జీవన్ కుమార్, మల్లెం విజయ భాస్కర్, అడ్వయిజరీ బోర్డు సభ్యులు డాక్టర్ వై.ఎస్. థామస్ రెడ్డి. శనివారం విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యాలయంలోని కమిషనర్ ఇంతియాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో. బరిల్ గ్రౌండ్ కోసం, పాస్టర్ గౌరవ వేతనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ సిఎం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి త్వరలో కార్యచరణకు నిధులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి పిల్లల్ని చట్ట బద్ధంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు (18 సంవత్సరాల లోపు పిల్లలకు) పిఎం కేర్స్ పథకం కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాధికారతాధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు పిల్లల ఆధార్ కార్డు, జనన ధ్రువ పత్రం, తల్లిదండ్రుల మరణ ధ్రువ పత్రాలు, రేషన్‌కార్డు, పిల్లల బ్యాంక్ పాస్‌పుస్తకం అన్నీ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు తప్పని సరిగా తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు.

మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

ఆర్థిక నేరగాళ్లకు నిలయంగా వైసిపి

ప్రజాశక్తి - కడప

ఆర్థిక నేరగాళ్లకు, దొంగలకు మహిళలను వేధించే వారికి వైసిపి ప్రభుత్వం నిలయంగా మారిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరగాళ్లకు, దొంగలకు, మహిళలను వేధించే వారికి నిలయంగా మారిన వారికి అధిష్టానం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పదవులను కట్టబెడుతున్నారని విమర్శించారు. పదవులు అడ్డం పెట్టుకొని చెలరేగిపోతూ ఆంధ్ర ప్రదేశ్ పరువును పోగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన వైసిపి నాయకురాలు బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రాజపుత్ర రజిని రూ. 40 లక్షల దొంగ నోట్లను మారుస్తూ బెంగళూరు పోలీసులకు పట్టు పడ్డారని పేర్కొన్నారు. దొంగ నోట్లు కాక డ్రగ్స్, గంజాయి దేశంలో ఏ రాష్ట్రంలో దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే దొరుకుతున్నాయని ఇది రాష్ట్రానికి తీరని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ పైనా, తన సొంత డ్రైవరును హత్య చేసిన ఎమ్మెల్సీ పైనా , మహిళలతో అసభ్య పదజాలాలుచేసిన అవంతి శ్రీనివాస్, గోరంట్ల మాధవ్, అంబటి రాంబాబుపైనా ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. రజనీతో పాటు ఎన్ని కోట్ల నకిలీ దొంగ నోట్లు చేతులు మారాయో, దీని సూత్రధారి ఎవరో నెగ్గు తేల్చి ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమా వేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస పేట శివ, టిడిపి నగర్ ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, 22వ డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, అనిల్ పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో మెలకువలు అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు ఎఆర్ మొబిలైజేషన్‌లో భాగంగా శనివారం సిబ్బందికి శనివారం నగర శివార్లలోని రాజీవ్ స్మృతివనం వద్ద ఉన్నఫైరింగ్ రేంజ్‌లో వార్షిక ఫైరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎఆర్ పోలీసులు, అధికారులు ఫైరింగ్‌లో మెలకువలు వివరించారు. డిఎస్‌పి రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో తుపాకీని ఎలా ఉపయోగించాలి, తుపాకీ నిర్వహణ, ఎస్ఎల్ఆర్ తుపాకీతో డ్రిల్ నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఆర్ఐ సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ భవన్‌ను పునఃప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ జనాబ్ బి.యస్. గౌస్ లాజమ్ స్వగృహంలో కడప హజ్ హౌస్ యాక్షన్ కమిటీ సభ్యులు కలిసి హజ్ హౌస్ పునః ప్రారంభించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ హౌస్ పునః ప్రారంభించడానికి కొన్ని సాంకేతిక, న్యాయ పరమైన సమస్యలున్నాయని ,వాటన్నింటినీ త్వరగా పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం జగన్ గారి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సంఘ సేవకులు సలావుద్దీన్, కో కన్వీనర్లు మహమ్మద్ అలీ ఖాన్ ,(లీగల్ అడ్వైజర్), తన్వీర్ అహ్మద్, జమీల్, ఇషాఖ్ మాల్వీ సాబ్, రఫిక్ ఖాన్, జహిరుద్దీన్, గౌస్ షబ్బీర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సయ్యద్ సలావుద్దీన్, కమిటీ సభ్యులు

నైపుణ్యంతో కూడిన సాధన అవసరం

ప్రజాశక్తి - కడప

విద్యార్థులతో తమ నైపుణ్యాన్ని బట్టి ఏ అంశంలోనైనా సాధన చేయింఆచలని వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహ చారి అన్నారు. స్టెప్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ హై స్కూల్ మెయిన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకొని ద్వారా వారి జీవిత లక్ష్యాన్ని నిర్ధర్శించుకోవాలని సూచించారు. చదువుకునే సమయంలోనే సరైన విభాగాన్ని ఎంచుకొని అందులో రాణించాలన్నారు. స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ మాట్లాడుతూ తమ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం- కెరీర్ కౌన్సిలింగ్ పై వివిధ కళాశాలలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులను చైతన్యవంతులను చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పుష్పలత, స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు రామ్మోహన్, సిద్ధారెడ్డి, శ్రీదేవి, సాజిద్, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నేడు అరసం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం)కడప జిల్లా శాఖ జిల్లా మహాసభ ఈనెల 29న సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు ఆచార్య నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక ప్రగతికి పునాదులేస్తూ, సమాజాన్ని పీడిస్తున్న శక్తులను ఎదిరిస్తూ, శ్రామిక వర్గం వైపు నిలబడి ప్రశ్నిస్తూ అభ్యుదయ సాహిత్యం కొనసాగిస్తూ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మానస సంస్థల అధినేత లయన్ కె. చిన్నపరెడ్డి, విశిష్ట అతిథులుగా రచయిత్రి, విమర్శకులు డాక్టర్ పి. సంజీవమ్మ, కవి, విమర్శకులు డాక్టర్ తక్కోల మాచిరెడ్డి, ప్రత్యేక అతిథులుగా కథ రచయిత పాలగిరి విశ్వప్రసాద్, పాత్రికేయులు ఎస్.ఎం.డి. బాషా హాజరవుతున్నారని తెలిపారు.

వైవీయూ దూరవిద్య ఉపసంచాలకులుగా శ్రీధర్‌బాబు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఉప సంచాలకులుగా డాక్టర్ ఎం. శ్రీధర్ బాబు నియమితులయ్యారు. విసి ఆదేశాల మేరకు కుల సచివులు ఆచార్య వై. పి. వెంకట సుబ్బయ్య నియామకపు పత్రాన్ని శనివారం శ్రీధర్ బాబుకు అందజేశారు. ఈయన అప్లయిడ్ మ్యాథ మెటిక్స్ సహాయాచార్యులుగా విశ్వవి ద్యాలయంలో పనిచేస్తున్నారు. అప్పగించిన బాధ్యతలను అకుంఠిత దీక్షతో నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వైవీయు విసి జింక రంగ జనార్దన్, రిజిస్ట్రార్, దూరవిద్య కేంద్రం సంచాలకులు ఆచార్య పిఎస్ షావలి ఖాన్, ప్రిన్సిపల్ ఆచార్యులుకె.కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం సదస్సు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 116వ సదస్సును ఆదివారం నిర్వహి స్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సులో 'ఆచార్య కొత్తపల్లి గంగాధర వేణు నాటకాలు - ఒక పరిశీలన' అనే అంశంపై విశాఖపట్నానికి చెందిన విశ్రాంత రసాయనశాస్త్ర అధ్యాపకులు ఆచార్య కొత్తపల్లి గంగాధర వేణు ప్రసంగిస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

హెల్మెట్, సీటు బెల్టులు ధరించి ప్రాణాలు కాపాడుకోండి : ఎస్‌పి

ప్రజాశక్తి కడప అర్బన్

హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామసభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు అంశాలుతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు, జీపులు నడిపే వారు సీటు బెల్టు వేసుకోవాలని తెలిపారు. వేగ నియంత్రణ. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవన్నారు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పరిమితికి మించి వెళ్లే ఆటోలపై అపరాధరుసుం విధిస్తామన్నారు. రోడ్డు భద్రత పై స్టిక్కర్లు, పోస్టర్లు ముద్రించి పట్టణాలతో పాటు గ్రామాల్లో అతికిస్తూ ప్రజల్లో అవగాహన తెస్తున్నామన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాలు ఆసరా కోల్పోయి రోడ్డున పడుతున్నాయని గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రహదారి భద్రత వారోత్సవాల నేపథ్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్‌పి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నిరయంత్రణకు అందరూ తమ వంతు సామాజిక బాధ్యతగా భావించి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 278 కేసులు ఇందులో హెల్మెట్ లేని కేసులు 256, సీట్ బెల్ట్ ధరించని వారిపై 22 కేసులు, జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 278 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 256 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, వాహన చోదకులు 22 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రగతి నివేదికలతో హాజరు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఈ నెల 30న జడ్‌పి సర్వసభ్య, జిల్లాస్థాయి రివ్యూ కమిటీ (డిఆర్‌సి) సమావేశాలకు అన్ని శాఖల జిల్లా అధికారులు ప్రగతి నివేదికలతో పాటు అభివృద్ధి ప్రతిపాదనల సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 30న ఉదయం 9.00 లకు సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఉమ్మడి వైఎస్ఆర్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు కలెక్టరేట్‌లో వైఎస్ఆర్ జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ తో పాటు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. జడ్‌పి, డిఆర్‌సి కమిటీ సభ్యులందరూ తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

అవకతవకలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం

- యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెన్నపూస మధురెడ్డి

మాట్లాడుతున్న వెన్నపూస మధురెడ్డి

కడప : ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తమ ప్యానల్ పై చేయిగా నిలిచిందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, ఎన్నికల్లో అవకతవకల గురించి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన వెన్నపూస మధు రెడ్డి చెప్పారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రౌండ్ లెవెల్ లో తమ కేడర్ చాలా బలంగా ఉందని అన్నారు. 2024 ఎన్నికల్లో వై విష్ణు ప్రీతం రెడ్డిని ఎమ్మెల్యే చేసుకోవడమే తమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ ఎన్నికల్లో తాము మద్దతు తెలిపిన యూత్ కాంగ్రెస్ రాష్ట అభ్యర్థి అయిన రామారావు 5333 ఓట్లతో గెలుపొందినట్లు చెప్పారు. కడప జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు గాను నాలుగింటిలో తమదే పై చేయి అని చెప్పారు. సమావేశంలో ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు మామిళ్ళ బాబు, ఫారుక్, అమీర్, సిరిగిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆడిటర్ శంకర్ రెడ్డి, దాసరి శంకర్ పాల్గొన్నారు.

ఉద్యమబాపుటా

ప్రజాదృష్టి

జిల్లా ఉద్యమబాట పట్టింది. 2014 రాష్ట్ర విభజన హక్కు చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే హామీ దఖలుపడిన సంగతి తెలిసిందే. 2014 ఎన్నికల్లో అధికారంలో వచ్చిన టిడిపి సర్కారు ఐదేళ్లు చోద్యం చూసింది. అనంతరం ఎన్నికల ఏడాది జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్మపోరాటం పేరుతో ఆమరణ దీక్షల నాటకాన్ని రక్తికట్టించింది. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే మూడేళ్లలోపు ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీతో వైసిపి అధికా రంలోకి వచ్చింది. అనంతరం అదే ఏడాది డిసెంబర్ 23, 24వ తేదీల్లో ప్రయివేటు కంపెనీ సహకారంతో కలిసి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని శంకుస్థాపనలు చేసింది. మూడున్నరేళ్లు అవుతున్నప్పటికీ వామపక్షాల ఆధ్వర్యంలో జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి శంకుస్థాపన రాతి దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు వామపక్షాలు ఉద్యమం చేపట్టడంతో కదలిక వచ్చింది. చివరి ఏడాదిన్నర వ్యవధి ఉండగా వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లాలో జివిఎస్‌డబ్ల్యూ కాంట్రాక్టు సంస్థ పేరుతో డిసెంబర్ చివరి వారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పేర్కొనడం తెలిసిందే. చివరి వారం ముగుస్తు న్నప్పటికీ వాయిదాల మీద వాయిదాలు పడుతుండడంతో ప్రత్యేక హోదా సాధన సమితి, డివైఎఫ్ఐ, యువజన సంఘాల ఆధ్వర్యంలో చలసాని శ్రీనివాస్ సారథ్యంలో ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0 పేరుతో ఉద్యమబాట పట్టడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కార్యక్ర మాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పంపై సందేహాలు వ్యక్తమవుతుండడం తెలిసిందే. ఇందుకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనుల్ని వాయిదా వేస్తుండడమే నిదర్శనమని తెలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల ముంగిట అప్పటి టిడిపి సర్కారు సైతం ఆమరణ దీక్షలతో రక్తి కట్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాయిదాల వ్యవహారం గుర్తుకుతెస్తోంది. ప్రయివేటు ఉక్కు పరిశ్రమ బ్రహ్మణీ పరిశ్రమ తరహా మారకుండా చిత్తశుద్ధితో పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. ఏదేమైనప్పటికీ జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక న్యాయం చేకూరు తుందని, తద్వారా జిల్లా సమగ్రా భివృద్ధి సాధ్యపడుతుందని చెప్పవచ్చు. ఇటువంటి ప్రయత్నానికి తిలోదకాలు ఇచ్చి ప్రయివేటు ద్వారా పరిశ్రమ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూనే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని, ఫలితంగా వందలాది అనుబంధ సంస్థలు రావడంతో జిల్లా నుంచి వెళు న్న వేలాది మంది నిరుద్యోగ వలసలు నివారించాలని కోరుతున్న వామపక్షాలు, యువజన సంఘాలు, అభ్యుదయ సంఘాల డిమాండ్ ఫలించాలని కోరుకుందాం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రబీ పంటల పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీలో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి సూచించారు. ఇకెవైసి కూడా చేయించుకోవాలని తెలిపారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో శనివారం ఆయన రబీలో సాగు చేసిన మొక్కజొన్న, కొర్ర, వంగ పంటలను పరిశీలించారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని ఎఒ తనిఖీ చేశారు. సాగులో పాటించవలసిన జాగ్రత్తలపై రైతులకు సలహాలిచ్చారు. చౌడు భూమి రైతులు పొలంలో జిప్సం వేసుకుంటే పొలం సారవంతమవుతుందని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న ఎఒ కృష్ణారెడ్డి

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

మామిడి చెట్లకు పూత వచ్చే సమయంలో సస్యరక్షణ చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి రెడ్డెయ్య రైతులకు సూచించారు. మండలంలోని సురభి గ్రామంలో శనివారం ఆయన మామిడి తోట రైతులతో మందుల పిచికారిపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా రెడ్డెయ్య మాట్లాడుతూ మామిడి తోటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులు అనుసరించాలని కోరారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డెయ్య

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని ఏకోపల్లె సమీపంలో నిర్మిస్తున్న గంగమ్మ దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని బిసి నేత పుంగనూరు రామ చంద్రయ్య యాదవ్ తెలిపారు. ఆ ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. నిర్మాణ పనులకు తన వంతు సాయం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యాదవులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ చైర్మన్ కదిరి సంజీవ రాయుడు యాదవ్, అఖిల భారతీయ యాదవ సంఘం కడప జిల్లా ఉపాధ్యక్షులు పంగా సుబ్బరాయుడు యాదవ్, అఖిల భారతీయ యాదవ సంఘం కడప జిల్లా సెక్రెటరీ మారుగని సురేష్ యాదవ్, టిడిపి దువ్వూరు మండలం యూత్ లీడర్ గంగాధర్ యాదవ్, సుబ్బరాయుడు, మైదుకూరు అఖిలభారతి యాదవ సంఘం ఉపాధ్యక్షులు పంగా గంగాధర్ యాదవ్, బాల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రామచంద్రయ్యను సన్మానించిన యాదవులు

యాత్రలు స్వార్థపూరితం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నారా లోకేష్ పాదయాత్ర, వవన్‌కల్యాణ్ చేస్తున్న రథయాత్ర స్వార్థపూరితమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరి యాత్రలు ప్రజాప్రయోజనం కోసం ఎంతమాత్రం కావన్నారు. ఈ మూడున్నర సంవత్సర కాలంలో ప్రజాసమస్యలు ఏమున్నాయని ఆయన ప్రశ్నించారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, యువకులు ఇలా అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. సచివాలయ ఉద్యోగులతో కలిపి 6లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. గత పాదయాత్రలో జగన్ చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని వివరించారు. 2014-19 కాలంలోని చంద్రబాబు పాలన అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. అప్పట్లో ప్రజాప్రయోజనార్థం ముఖ్యమంత్రి జగన్‌కు పాదయాత్ర చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి వాహనదారుడు లైసెన్సు కలిగి ఉండాలని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం సాయంత్రం వేంపల్లెలోని బైపాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. అలాగే రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే టప్పుడు రికార్డులను దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు తిరుపాల్ నాయక్, రఘురాం, హెడ్ కానిస్టేబుల్ వర్మ, కానిస్టేబుల్ శివ పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా విధిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

కొలవలి ఉప సర్పంచ్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు

ముద్దనూరు : మండలంలోని కొలవలి గ్రామ పంచాయతీ ఉప సర్పంచు చిన్న గంగన్నకు ఇన్‌ఛార్జి సర్పంచుగా బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రమణారెడ్డి ఉత్తర్వులు అందజేశారు. సర్పంచ్ వరలక్ష్మి కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిమాండ్ సాధనకే పోరాటం

చెన్నూరు : డిమాండ్ సాధన కోసమే ఈనెల 30న పోరాటం చేయనున్నట్లు మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజనం కార్మికులుగా 85,000 ఉన్నారని చెప్పారు. కనీస వేతనం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నెలకు రూ.3 వేలు ఇస్తామన్న ప్రభుత్వం కొన్ని నెలలుగా రూ.2 వేలు ఇచ్చి సరిపెట్టుకుంటోందని వాపోయారు. ఒక విద్యార్థికి రోజుకు రూ.20 చొప్పున చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులు వెంటనే ఇవ్వాలని పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు ఏం మేరీ, లక్ష్మీ పార్వతి, రత్నమ్మ, బాలసుబ్బమ్మ, కాసింబి, జయమ్మ పాల్గొన్నారు.

మినుము నూర్పిడిలో రైతులు నిమగ్నం

పెరిగిన సాగు విస్తీర్ణం - పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన మినుము పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. ఆయా పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది మినుము పంట సాగు అధికంగా సాగైంది. గత ఖరీఫ్‌లో వరి సాగు చేసి దిగుబడి, ధరలు సరిగా లేక ఆర్థికంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో సాగు ఖర్చులు తక్కువైనా మినుము సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారు. ప్రస్తుతం ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు మినులు దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. క్వింటా రూ.6వేలకు పైగా ధర పలుకుతోంది. జిల్లాలో 17,552 వేల ఎకరాల్లో మినుము సాగైంది. తక్కువ పెట్టుబడి కావడం, వ్యవసాయంలో వస్తున్న మార్పులు, మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేపడుతున్నారు. పెట్టు బడి భారం ఉండి, దిగుబడి తక్కువగా వచ్చే పం టల సాగు తగ్గిస్తున్నారు. జిల్లాలో వరి తర్వాత వేరుశనగ, శనగ ప్రధాన పంటలుగా చాలా ఏళ్లుగా రైతులు సాగు చేస్తూ వస్తున్నారు. మూడేళ్లుగా ఆయా పంటల సాగు ఆశాజనకంగా లేదు. వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడులు తగ్గిపోవడం, నాణ్యత లేకపోవడం, జింక్ లోపంతో పెట్టుబడి సమస్య ఎక్కువ కావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే సాగకు అధిక ఖర్చులు వస్తాయి. పెట్టుబడి భారం కాని మినుము పంట సాగు వైపు రైతులు దృష్టి సారించారు. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువగానే ధరలు వస్తుండడం, వ్యవసాయ అధికారులు కూడా పంట మార్పిడి చేయాలని సూచించడం వల్ల రైతులు ఆ వైపుగా ఆలోచిస్తున్నారు.

మినుము నూర్పిడి పనిలో రైతు

మూడింతలు పెరిగిన మినుము సాగు

గతంలో జిల్లాలో సాగునీటి వనరులు సరిగా లేని సమయంలో వేరుశనగనే ప్రధాన పంటగా రైతులు సాగు చేసేవారు. ఇప్పుడు వరి సాగు పెరగడంతో వేరుశనగ రెండో ప్రధాన పంటగా మారింది. ముందస్తు వేరుశనగ సాగు చేయడంతో చలి, వాతావరణ మార్పులతో దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో మండలాల రైతులు వేరుశనగ, పప్పు శనగకు బదులు మినుముల సాగును పెంచుతున్నారు. గత సీజన్‌లో మినుము సాగు 5,954 ఎకరాల్లో కాగా, ఈ ఏడాది ఏకంగా 17,552 ఎకరాల్లో సాగైంది. గతేడాది కంటే 12వేల ఎకరాల్లో అధికంగా సాగైంది.

ధర రూ.7వేల వరకు..

మినుములకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.6 వేలు మద్దతు ధరగా నిర్ణయించింది. ప్రయివేట్ వ్యాపారులు దాదాపు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ధర ఇచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువగా వస్తుండడంతో మినుములు లాభసాటిగా ఉందని రైతులు భావిస్తున్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ఎ-వన్ గ్రేడ్ సాధించేలా సంక్షేమాధికారులు చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ సంయుక్త సంచారకులు జయప్రకాష్ ఆదేశించారు. స్థానిక బాలికల కళాశాల వసతి గృహంలో శనివారం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ మేరకు ఇప్పటి నుంచే పబ్లిక్ పరీక్షలకు ప్రణాళిక రూపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సంక్షేమా ధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు 2 నెలల సమయం ఉన్నందున ట్యూటర్ల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థి భవిష్యత్ పదవ తరగతి నిర్ణయిస్తుందన్నారు. అనంతరం పాలిటెక్నిక్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. ఫలితాల శాతం తక్కువగా ఉంటే అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు గురుప్రసాద్, స్వర్ణలత, వసతి గృహ సంక్షేమ అధికారులు రామకృష్ణారెడ్డి, బ్రహ్మం, నాగరాజు నాయక్, బషీర్, వి.నాగరాజు, గురుజ్యోతి, శివలక్ష్మి, వహిదా బేగం, నరసారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బుజ్జమ్మ, అనిత, విషయ నిపుణులు నాగేశ్వరరావు, హుషా కేశవాచారి, చంద్రమోహన్, సంజీవరెడ్డి, బాలరాజు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ సహాయ సంచాలకులు జయప్రకాష్

కేసుల పరిష్కారానికి పోలీసులు సహకరించాలి

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్.హారిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేసుల పరిష్కారానికి పోలీసులు సహకరించాలని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.హారిక కోరారు. కేసులు త్వరగా పరిష్కారమై సంబంధితుల జీవనం మెరుగుపడడానికి ఫిబ్రవరి11న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసులు సహకరించాలని న్యాయమూర్తి స్థానిక కోర్టులో శనివారం పోలీస్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా ఒకసారి కేసు రాజీ అయితే కోర్టుల చుట్టూ పోలీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. చక్కటి జీవితాన్ని అలవర్చుకోవ్వని సూచించారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ అయితే సుప్రీం కోర్టుతో సమానమన్నారు. సివిల్,క్రిమినల్, రోడ్డు ప్రమాద కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో సిఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణ యాదవ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ఉచిత న్యాయ సహాయం

చాపాడు : రూ.లక్షలోపు సంవత్సర ఆదాయం కలిగిన పేద ప్రజలకు ఎలాంటి ఫీజు చెల్లించకుండా కోర్టులో సేవలు పొందేందుకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ ఎస్ ఖాజామొయిద్దీన్ తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. జీవనానికి ఇతరుల వల్ల ఇబ్బందులు ఎదురైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునన్నారు. ఫిబ్రవరి 11న నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కెసి రాజు, న్యాయవాదులు జ్వాలా నరసింహశర్మ, మైదుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవిశంకర్, రవి, జెకె చారి, ఎఎస్ఐ శంకరయ్య, పోలీస్ సిబ్బంది రమణ, నాగేంద్ర, రాఘవరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

జమ్మలమడుగు రూరల్ : రాజీమార్గమే రాజమార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టులో శనివారం ఆయన పోలీస్‌శాఖ, బార్ అసోసియేషన్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వచ్చే నెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. గత లోక్ అదాలత్‌లో కేసులు అధికంగా పరిష్కరించబడి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, బార్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, జమ్మలమడుగు అర్బన్, రూరల్, కొండాపురం, ముద్దనూరు సిఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, సబ్ జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డికి టికెట్ ఇస్తే సహకరించేది లేదు : 'గంగవరం'

అసమ్మతి వాదులతో కలిసి మాట్లాడుతున్న గంగవరం శేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో టికెట్ ఇస్తే సహకరించేది లేదని వైసిపి అసమ్మతి నాయకులు గంగవరం శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సాయినగర్‌లో శనివారం ఆయన తన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన నూతన కార్యాలయంలో శేఖర్‌రెడ్డి అసమ్మతివాదులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కార్యకర్తలను నమ్మించి, గెలిచాక వారిని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి కార్యకర్తలకు అండగా ఉండేందుకు ఎర్రగుంట్లలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. చిన్నదండ్లూరు సర్పంచు రాముడు మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని ఎంతో డబ్బులు ఖర్చు పెట్టి సర్పంచుగా గెలిచినా తనను ఎమ్మెల్యే పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వ్యతిరేకంగా పనిచేసిన బిజెపి వారితో కలిసి ఎమ్మెల్యే అక్రమంగా మట్టి తరలిస్తుంటే అడ్డుకున్నందుకు తనపైనే ఎస్‌సి కేసు బనాయించారని ఆరోపించారు. టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి దగ్గరకు వెళ్లినా పట్టించుకునే వాడిని కాదని, శేఖర్‌రెడ్డి దగ్గరకు వెళ్తావా అంటూ ఎమ్మెల్యే అన్నారని ఆరోపించారు. కార్యాలయ ప్రారంభోత్సవంలో నియోజకవర్గంలోని అసమ్మతి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ముద్దనూరు పంచాయతీ కార్యదర్శిగా నరసింహులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నరసింహులు కార్యాలయంలో ఎంపిడిఒ రమణారెడ్డి అధ్యక్షతన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ, డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న గురుమోహన్ డిప్యుటేషన్‌పై ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీకి బదిలీ అయ్యారు. గురుమోహన్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలను పొందారు. బాధ్యతలు అనంతరం నరసింహులు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 66వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉమ్మడి 13 జిల్లాల నుండి 520 మంది క్రీడాకారులు 30 మంది కోచ్‌లే. మేనేజర్లు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా డిఇఒ సి.దేవరాజు, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరుకావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. పాఠశాలలో గ్రామ పెద్దలచే మంచి సౌకర్యాలు ఏర్పాటు చేసినందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంట్ అబ్జర్వర్ ప్రభాకర్ మాట్లాడారు. వీరితోపాటు టోర్నమెంట్ ఆర్గనైజర్ తిరుపాల్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ సంయుక్త కార్యదర్శి ఎస్ జిలానిబాషా, పీడీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి శివశంకర్‌రెడ్డి, సునీల్, శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తమ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు తాలూకా ఎన్‌జిఒ అధ్యక్షులు రఘురామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు తాలూకా పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగులకు మంచి కంటిచూపు ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు వై.వి.స్వరూప్‌కుమార్‌రెడ్డి, రెటీనా నిపుణులు డాక్టర్ కోటేశ్వరరావు బృందం కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యశిబిరం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లోకేష్ పాదయాత్రకు అపూర్వ స్పందన : భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రెండో రోజు పాదయాత్రలో భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో టిడిపి జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నాయకులు కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

డిఆర్‌డిఎలో లీగల్ కో-ఆర్డినేటర్ ఉద్యోగి రామాంజనేయులు (45) శనివారం పట్టణంలో గుండెపోటుతో మృతి చెందారు. వివరాల మేరకు.. ఆయన చక్రాయపేట, వేంపల్లి, పులి వెందుల ఎల్‌సి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. పని నిమిత్తమై ఆయన పులివెందుల పట్టణంలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా శ్రీనివాస రోడ్డులోని రవిబుక్ స్టాల్ సమీపంలో రాగానే గుండెపోటు రావడంతో కింద పడిపోయారు. గమనించిన స్థానికులు రామాంజనేయులును ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామం వీరపునాయునిపల్లి మండలం గోనమాకులపల్లె అని సంఘటనాస్థలంలో తెలిపారు.

మృతి చెందిన రామాంజనేయులు

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒకు గాయాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాజుపాలెం విఆర్‌ఒగా పనిచేస్తున్న గుద్దేటి శ్రీనివాసులరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా తన సొంత గ్రామమైన పెద్దముడియం మండలం ఉప్పలూరు నుండి వస్తుండగా కుమ్మరపల్లె గ్రామ సమీపంలోని వంక వద్దకు రాగా ప్రొద్దుటూరు నుండి ఆళ్లగడ్డకు వెళతున్న ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా కుడి పక్కకు స్కూటర్ వైపు రావడంతో బస్సు వెనుక భాగం స్కూటర్‌ను ఢీకొంది. స్కూటర్‌పై ఉన్న శ్రీనివాసులరెడ్డి గాయపడ్డారు. సమీపంలోని స్థానికులు ఆయనను 108లో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు రాజుపాలెం ఇన్‌ఛార్జి ఎస్ఐ కృష్ణంరాజు నాయక్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన విఆర్‌ఒ శ్రీనివాసులరెడ్డి

వసతిగృహ ఆవరణలో పందుల సంచారం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపి కాలనీ ప్రాజెక్టు హాస్టల్ ఆవరణలో పందుల సంచారం ఎక్కువైంది. వసతిగృహ ప్రాంగణంలోనే కాకుండా కాలనీలోని ఇళ్ల వద్ద సంచరిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి సంచారం వల్ల రోగాల పాలవుతున్నామని వాపోతున్నారు. వాటిని తరిమేయాలని ప్రయత్నిస్తే తిరగబడుతున్నాయని తెలిపారు. కాలనీకి ప్రహరీ సెక్యూరిటీ ఉన్నా కూడా పందుల లోనికి వస్తున్నాయని, ఇది ఎవరి నిర్లక్ష్యమని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయాల్లో పందులు కనిపించక వాటిని తగిలి కిందపడి గాయాలపాలైన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పందుల బెడదను తప్పించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ప్రాజెక్ట్ హాస్టల్ ఆవరణలో సంచరిస్తున్న పందులు

IN THE HON'BLE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD

O.S.No. 466 OF 2020

Between:
State Bank of India, RACPC-III, Hyderabad. ... Plaintiff
AND
Mr.Ranga Reddy Tatimakula and Another ... Defendants

To
1.Mr. Ranga Reddy Tatimakula S/o T.Sankar Reddy, # 15/557-1, Pandu Ranga Swamy Temple Street, Mydukur Road, Proddatur - 516360.
2. T. Sankar Reddy, Plot No. 706, 2nd Floor, Vivaknand Nagar Colony, Hyderabad - 500 072.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at **10.30 AM on 10.02.2023** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the court.

Smt. Rapaka Aruna, Advocate, 11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram, Hyderabad-500060.Cell: 9030617991

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE:: KADAPA.

O.S.No. 955/2021

State Bank of India, I.T.I.Circle Branch, Kadapa, Represented by its Branch Manager. **...Plaintiff**

Vs

N.Venkata Prathap Reddy, S/o N.Nagi Reddy, Civil Engineer, aged 26 years, Hindu, Residing D.No.39/641-C, Patel Raod, Kadapa District. **...Defendant**

NOTICE TO DEFENDANT

ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు పై దావాలో తెలిపిన వాది తెలియజేయడం ఏమనగా మీ మీద పై దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ నోటీసుకు గానూ 30.01.2023వ తేదీన వాయిదా వున్నది. కావున మీరు 30.01.2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు మీపై పరోక్షముగా తీర్మాణించబడును.

//By Order of the Court//

SHAIK KHAJA MOHIDDIN
Advocate for Plaintiff,
Kadapa City. Cell: 9440534086.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT CHITTOOR
ARC.No. 67 OF 2020

Between:
Kapil ChitS(Hyd) Pvt., Ltd., Srikalahasthi Rep., by its Legal Officer **..Disputant**
And:
R. Siva Prasad & others **..Opponents**

SUMMONS TO OPPONENTS NO.1 and 4

To
1. R. Siva Prasad, S/o R. Chandraiah, Correspondent, Sri Chandramma Education Society, rayachoti, kadapa District, Residing at D.No. 3-19, Kondavandla Palli, Narayana Reddy Palli Post, Sambepalli Mandal, Kadapa District.
4. P. Vijaya Kumar, S/o P. Bala Subbaiah, Working as Junior Assistant, R& B Department, Government of AP Kadapa Town & District, Residing at, D.No. 3-50-A, Kondavandla Palli, Narayana Reddy Palli Post, Sambepalli Mandal, Kadapa District.

Sir,

Please take notice that the above case is posted to 17-02-2023 for your appearance. You may appear either in person or through an advocate on 17-02-2023 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.

Hearing Date: 17-02-2023

Sd/-
SRI. M. RAJESH, M.COM., LLB., ADVOCATE ; TIRUPATI

IN THE COURT OF THE HON'BLE PRINCIPLE SENIOR CIVIL JUDGE, KADAPA.
IP. No. 65/2022

Syed Shareef Hussaian S/o S.Hussain, Muslim, aged about 36 years, Business, residing atDoor No.8/218-4-2, Prakash Nagar, Kadapa City and District. **...Petitioner**

Vs

1. G.Madhu Srinu Kumar S/o G.Ganganna, Hindu, aged about 40 years, PrivateEmployee, Residing at Door No.96/13.Utukuru Village, Chinthakomma Dinne Mandal. Kadapa Disrtict.
2 Shaik Khader Basha S/o S.Mahaboob Basha, Muslim, Business, residing at D.No.1-193. Yadamarry Village and Mandal, Chittore District.
3. Yegi Babji S/o Y.SaiBabu, aged about 36 years, Hindu, Business, residing at D.No.2-95, B.C.Colony, Main road, Gummaladoddi village and Mandal, East Godavari District. PIN CODE.533285.
4. DargaShashaValli S/o D.Abdul Rahim, aged about 40 years, Muslim, residing atD.No.4/15, Nagarajupeta, Kadapa District.
5. Shaik Ghose Basha S/o Zeelani Basha, aged about 40 years, business, residing atD.No.89/37, Mamillapalli, ChinthaKomma Dinne Mandal, Kadapa District.
6. Kaditham Venkata Krishna S/o K.Venkata Ramana aged about 30 years, Hindu, residing at 88/183, Angadiveedhi, Mamillapalli, Chinthakomma Dinne Mandal, Kadapa District.
7. Chithakunta Surendra S/o Late C.Yesu Rathnam, aged about 26 years, Christian,residing at C/o D.No. 19/206,Tekkaya Chenu street, Janmmala madugu Town and Mandal, Kadapa District. **...Respondents**

NOTICE

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పైన కనబరిచిన పిటీషనర్ మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు:కడప నందు I.P. దావా వేసియున్నారు. సదరు కేసు ఈ నెల 31/1/2023వ తేదీన ఉదయం రెస్పాండెంట్స్ అయిన మీ అందరి యొక్క అప్పీయరెన్స్ కలదు. కావున పైన కనబరచిన ప్రతివాదులందరూ స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరు కావలసియున్నది. అట్లుకాని యెడల మహారాజశ్రీ కోర్టువారిచే ఎక్స్‌పార్టీ ఆర్డరు జారీ చేయబడును.

బి. సురేష్‌కుమార్
పిటీషనర్ తరపు న్యాయవాది,
కడప